# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

## గురివింద మోదీ

**దిగజారుడు..** మోదీ నిజామాబాద్ ప్రసంగానికి సరిపోయే ఏకైక మాట ఇది. అంతకన్నా దిగజారడం ఎవ్వరికీ సాధ్యం కాదేమో. తాను దేశంలో అత్యున్నత పరిపాలన పదవిలో ఉన్నాననే సోయి కూడా మరచిపోయి సొల్లువాగుడుకు తెగబడటం మోదీకే చెల్లింది. కేసీఆర్ అంటే చావు అంచుల దాకా వెళ్లి స్వరాష్ట్రం సాధించిన అరుదైన నేత. సాధించిన రాష్ర్టాన్ని ప్రగతి పథంలో నడిపించి దేశానికే ఆదర్శంగా నిలిపిన అపురూప నిర్మాత. సహజంగానే ఇక్కడి ప్రజలు ఒకటికి రెండుసార్లు ఆయనకే పట్టం కట్టారు. ముచ్చటగా మూడోసారి అధికారం అప్పజెప్పాలని చూస్తున్నారు. అదీ ఇక్కడి ప్రజల నమ్మకం. అది చూసి కుళ్లుకోని విపక్ష రాజకీయ నేత లేడు. కేసీఆర్ నుంచి ప్రజలను తెగ్గొట్టాలని పన్నాగం వేయని అధికార వ్యామోహి లేడు. అధికార దాహం అలాంటిది. కేసీఆర్ మీది ఈర్ష్య వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. కేసీఆర్‌ను ఎన్నికల పోరులో ఓడించలేరు. ఇక్కడి ఓటర్లు అందుకు సిద్ధంగా లేరు. ఎమ్మెల్యేలను కొనేసి అంతా ఉల్టాపుల్టా చేద్దామంటే ఇక్కడున్నది కేసీఆర్. కన్నం దొంగలను కన్నంలోనే పట్టుకొనే ఒడుపు ఆయనకు తెలిసినట్టుగా మరెవరికీ తెలియదు. అందుకే దొంగదెబ్బ తీద్దామని కాచుక్కూర్చున్నాయి రాజకీయ తోడేళ్లు. బట్టకాల్చి మీదేయాలని ఉరుకులాడుతున్నాయి. అందులో బీజేపీ పరివార్, ముఖ్యంగా మోదీ ముందుంటారు. ఎర్ర గురివిందకే సిగ్గు కలిగేలా మాట్లాడటంలో ఆయన ఆరితేరారు. రాజకీయాల్లో ఏమి జరుగుతుంది? అవతలి వాళ్ల కన్నా మెరుగైనది సాధించి చూపుతామని చెప్తే సబబుగా ఉంటుంది. కానీ మోదీ తెలంగాణకు ఏమి చేశారో చెప్పరు. ఏమి చేస్తారో చెప్పరు. చెప్పేందుకు, చేసేందుకు ఆయన దగ్గర ఏమైనా ఉంటే కదా! ఆ ఏమీలేని డొల్లతనం వల్లనే స్థాయి మరిచి అడ్డదిడ్డం విమర్శలు చేస్తుంటారు. కానీ ఒక వేలు నువ్వు చూపితే నాలుగు వేళ్లు నిన్ను చూపుతాయని మోదీ తెలుసుకోవాలి. ఆయన పైసా ఇవ్వకున్నా సొంత నిధులతో పథకాలు, ప్రాజెక్టులు అమలు చేస్తున్నది తెలంగాణ. ఒక్కసారి ఆయన తన గుజరాత్ మాడల్‌ను తెలంగాణతో పోల్చి చూసుకుంటే తెలుస్తుంది అభివృద్ధి అంటే ఏమిటో.

సీఎం కేసీఆర్‌ను చూస్తే మోదీకి కండ్లమంట. తెలంగాణ సాధించిన అద్వితీయ ప్రగతిని చూస్తే కడుపు మంట. ఎమ్మెల్యేల కొనుగోలు ప్రహసనం బట్టబయలుతో తన పరువు పోగొట్టుకున్న మాట మోదీ మరిచినట్టున్నారు. అమాయక గుజరాతీలను మభ్యపెట్టినట్టుగా ఇక్కడా అవాకులు, చెవాకులు పేలితే పని జరుగుతుందని అనుకున్నట్టున్నారు. ఢిల్లీ నేతననే సంగతి మరిచిపోయి ఒళ్లు తెలియక గల్లీ స్థాయి మాటలకు దిగారు. దేశానికి ప్రధానిననే తెలివిడి కొరవడి గుజరాతీ ప్రధానినని మాటజారారు. పైగా స్వాతంత్య్రోద్యమ జాతీయ మహా నేత సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను తనతోపాటుగా గుజరాతీ స్థాయికి దించారు. సహేంద్ర తక్షకాయ స్వాహా అంటే ఇదే. కేసీఆర్ తన కుమారుడు కేటీఆర్‌ను సీఎం చేయాలనుకున్నారట. అందుకు మోదీ గారి ఆశీస్సులు కావాలన్నారట. పైగా ఎన్డీయేలో బీఆర్ఎస్‌ను చేరుస్తానన్నారట. ఏమి వాక్చాతుర్యం? ఇందులో ఏమన్నా అర్థముందా? ఆకుకు అందకుండా, పోకకు పొందకుండా మాట్లాడటమంటే ఇదే. ఇక్కడి ఓటరును ఎలాగోలా మాయ చేయాలనే చౌకబారు సొల్లు మాటలు కావా ఇవి? కేవలం ఇద్దరి మధ్య జరిగినట్టుగా చెప్పుకొనే మాటలకు సాక్ష్యమెవడు? అయినా తన పార్టీని ఎన్డీయేలో చేర్చాల్సిన అగత్యం కేసీఆర్‌కు ఏముంది? కేటీఆర్ సీఎం కావాలంటే బీఆర్ఎస్ లెజిస్లేచర్ పార్టీ నిర్ణయిస్తుంది. మోదీ ఆశీస్సులతో పనేమిటి? చిన్న పిల్లలు కూడా నవ్వుకునేలా మాట్లాడి ఏమి సాధించాలనుకున్నారు మోదీ?

ఓటమి భయంతో వణికిపోతున్న మోదీ ఏ ఆకు దొరికినా పట్టుకోవాలని చూస్తున్న సంగతి దేశానికి తెలుసు. అందుకే చివరి దింపుడుకల్లం ఆశగా మహిళా రిజర్వేషన్ బిల్లు ముందుకు తెచ్చారనేది ఎవరికి తెలియదు. ఇప్పట్లో అది కార్యరూపం దాల్చే అవకాశాలే లేవు. మరైతే ఎందుకు హడావుడి? ప్రత్యేక సమావేశాల పేరిట హంగామా ఎందుకు? 370 తరహాలో దీనినీ ముందుగానే ఎందుకు ఎజెండాగా చేసుకోలేదు. అంటే మోసం, దగా. నయవంచన. మతం పేరిట, పాకిస్థాన్ బూచి పేరిట ఆడిన నాటకాలు అయిపోయాయి. అందుకే మహిళల ముందు మోకరిల్లుతున్నారు. కొత్త నాటకాలకు తెరతీస్తున్నారు. మోదీ వంగి వంగి దండాలు పెడితే కర్ణాటక ప్రజలు విసిరి అవతల పారేసిన సంగతి మనకు తెలుసు. తెలంగాణ ప్రజలను మరోసారి వంచించేందుకు మోదీ హామీలిస్తున్నారు. ఇవి ఎన్నికల్లో లబ్ధి కోసమే ఇచ్చినవని ఎవరికి తెలియదు? స్విస్ నల్లధనం, రెండు కోట్ల ఉద్యోగాల తరహా మోదీ హామీలు నీటి మూటలని తెలియనిది ఎవరికి? నిజామాబాద్ సభలో గుడ్లురుముతూ, వేలు చూపుతూ చాలా ప్రయాస పడిపోయారు మోదీ. ఏదో జరిగిపోయినట్టుగా నమ్మించేందుకు చాలానే నటించారు. కానీ ఏం లాభం? తెగించి పోరాడే తెలివైన బిడ్డల తెలంగాణ గడ్డ ఇది. మోదీ మోసకారి మాటలకు పడిపోయేవారు ఇక్కడ ఎవరూ ఉండరన్న సంగతి గుజరాతీ ప్రధానికి మరోమారు తెలిసివచ్చే రోజు త్వరలోనే రానున్నది.



'ప్రపంచాన్ని మార్చే శక్తిమంతమైన ఆయుధం విద్య మాత్రమే'అని నెల్సన్ మండేలా అన్నారు. అలాంటి శక్తిమంతమైన ఆయుధాన్ని ప్రజలకు అందించే వారు, మనిషిని పరిపూర్ణమైన వ్యక్తిగా తీర్చిదిద్దే క్రాంతి ప్రదాతలు ఉపాధ్యాయులు. అందుకే సమాజంలో తల్లిదండ్రుల తర్వాత గురువులకు విశిష్ట స్థానం ఉన్నది. ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఏటా అక్టోబర్ 5న జరుపుకొంటారు.

## సమాజ క్రాంతి నిర్దేశకులు



పాకాల శంకర్ గౌడ్
9848377734

ఉపాధ్యాయుల హక్కులు, బాధ్యతలు, విద్య, నియామకం, ఉపాధి, బోధన, అభ్యసనాలను నిర్దేశించే ఉపాధ్యాయుల ప్రమాణాలను 1966లో రూపొందించారు. దీని కోసం అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో), యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్ (యూనిసెఫ్), ఎడ్యుకేషన్ ఇంటర్నేషనల్ (ఈఐ)లు చేసిన సిఫారసులను ప్యారిస్‌లో ఆమోదించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని 1994 అక్టోబర్ 5 నుంచి ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు.

'ఉపాధ్యాయుల కొరతను అధిగమించడం: ప్రపంచ ఆవశ్యకత' అనే థీమ్‌తో 2023 ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను యునెస్కో ఘనంగా నిర్వహిస్తున్నది. ఉపాధ్యాయుల సంఖ్యను పెంచటం, సమాజానికి నాణ్యమైన విద్యను అందించడం దీని లక్ష్యం.

2030 యునెస్కో ఎజెండాలోని విద్యా లక్ష్యాలను చేరుకోవాలంటే సుశిక్షితులైన ఉపాధ్యాయుల అవసరం ఉన్నది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయుల కొరత 69 మిలియన్లు. ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారు. ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న కీలక సవాళ్లను పరిష్కరించే నిపుణుల తయారీ సుశిక్షుతులైన ఉపాధ్యాయులతోనే సాధ్యం. టీచర్ల కొరతను తగ్గించడానికి, ప్రతి విద్యాసంస్థ సాంకేతికతను ఉపయోగించుకునేలా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలి. దాంతోపాటు, ప్రభావవంతమైన పాఠాలను అందించడానికి వారి బోధనాశైలిని మెరుగుపర్చుకోవటం చాలా ముఖ్యం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని టీచర్లు ఉపయోగించేలా చూడటం ద్వారా నాణ్యమైన విద్య విద్యార్థులకు అందుతుంది.

26.5 కోట్ల మంది విద్యార్థులు,14.9 లక్షల పాఠశాలలు, 95 లక్షల మంది ఉపాధ్యాయులతో భారతీయ విద్యా వ్యవస్థ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యా వ్యవస్థగా గుర్తింపు పొందింది. అతి పెద్ద ప్రజాస్వామిక దేశం, అతిపెద్ద విద్యావ్యవస్థలో ఉన్న మనం విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చినప్పటికీ దేశ ప్రజలకు పూర్తిస్థాయిలో నాణ్యమైన విద్య అందించడంలో సఫలీకృతం కాలేకపోతున్నాం.


భారతదేశంలో ఉపాధ్యాయులకు అత్యధిక డిమాండ్ ఉన్నది. భారత ప్రభుత్వం 2030 నాటికి ప్రాథమిక విద్యలో 100 శాతం స్థూల నమోదు(ఎన్‌రోల్‌మెంట్) లక్ష్యంగా పెట్టుకున్నది. యునెస్కో నివేదిక ప్రకారం భారతదేశంలో 12 లక్షల ఉపాధ్యాయుల అవసరం ఉన్నది. ఆర్థిక సర్వే 2023 ప్రకారం విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తి అన్ని స్థాయుల్లో స్థిరంగా పెరుగుతున్నది. ఐక్యరాజ్యసమితి విద్య, విజ్ఞాన (శాస్త్రీయ), సాంస్కృతిక సంస్థ (యునెస్కో) తాజా నివేదిక ప్రకారం భారతదేశంలో దాదాపు 1.1 లక్షల ఏక ఉపాధ్యాయ పాఠశాలలున్నాయి. దేశంలోని పాఠశాలల్లో మొత్తం 19 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంఖ్య 69 శాతం వరకు ఉన్నది.

'జ్ఞానంపై పెట్టుబడి ఉత్తమ వడ్డీని చెల్లిస్తుంది' అంటాడు బెంజిమిన్ ఫ్రాంక్లిన్. 21వ శతాబ్దంలో భారతీయ యువత ప్రపంచంతో పోటీ పడాలని, దానికోసం వారికి నాణ్యమైన విద్యను అందించాలని, వారిలో సృజనాత్మకతను పెంచాలని భారత ప్రభుత్వం 2020 జూలై 29న నూతన జాతీయ విద్యావిధానాన్ని తీసుకొచ్చింది. నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం భారతదేశ జీడీపీలో విద్యారంగానికి కనీసం ఆరు శాతం నిధులను కేటాయించాలి. కానీ ఈ ఆర్థిక సంవత్సరంలో భారత ప్రభుత్వం బడ్జెట్‌లో కేవలం 2.9 శాతం నిధులు (రూ.1,12,899 కోట్లు) మాత్రమే కేటాయించింది. ప్రపంచంలో నాణ్యమైన విద్యను అందించే దేశాలు వాటి బడ్జెట్‌లో 6 శాతం కన్నా ఎక్కువ నిధులనే కేటాయిస్తున్నాయి. ఉదాహరణకు నార్వే, చిలీ దేశాల్లో 6.6 శాతం, ఇజ్రాయెల్, న్యూజిలాండ్‌లు 6.2 శాతం, ఇంగ్లాండ్ 6.1 శాతం, అమెరికా 6 శాతం నిధులు కేటాయించి నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి.

ఉపాధ్యాయ వృత్తి అనేక సవాళ్లతో కూడుకున్నది. అయితే నేటి ఆధునిక కాలంలో ఉపాధ్యాయ వృత్తిలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రగతిశీల చైతన్యపూరిత భావజాలానికి బదులుగా కార్పొరేటీకరణ, వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ, స్వచింతన విద్యారంగంతో పాటు ఉపాధ్యాయుల్లో కూడా నెలకొన్నాయి.

నేటి బాలలే రేపటి పౌరులు. వారికి నైతిక విలువలు, మానవీయత, శాస్త్రీయ పరిజ్ఞానం, పర్యావరణ పరిరక్షణ, ప్రగతిశీల భావనలు వంటి అంశాలు బోధించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉన్నది. అప్పుడే నవభారత నిర్మాణం సాధ్యమవుతుంది.

**(నేడు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం)**





## ఇద్దరు గుజరాతీలా?

ఇద్దరు గుజరాతీలు! ఇద్దరూ గుజరాతీలేనా? కాదు, కానే కాదు! పుట్టుక బట్టి వ్యక్తిత్వం ఉండదనీ, గుర్తింపు ఉండకూడదనీ సాక్షాత్తూ శ్రీకృష్ణుడే చెప్పాడు: 'చాతుర్వర్ణం మయాసృష్టం గుణకర్మ విభాగశః' అని (భగవద్గీత విభాగ 4 శ్లోకం 13) అంటే మనిషి, మనిషికి వేరుగా ఉండే వర్ణాలని-అంటే ప్రవృత్తిని బట్టి - తను సృష్టించానన్నాడు. గుజరాత్‌లో పుట్టినవాళ్లందరూ ఒకేలా ఉండరూ, వారి వారి పూర్వజన్మ సంస్కారాలను బట్టి ఈ జన్మ గుణాలుంటాయీ అని అర్థం! ఇక ఇద్దరు గుజరాత్‌లో పుట్టినవారికి లేశమైనా పోలికలున్నాయేమో పరిశీలిద్దాం!



కనకదుర్గ దంటు
89772 43484

ఒక గుజరాతీ దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక మొట్టమొదటి హోంమంత్రి. అంటే కేంద్రమంత్రి వర్గంలో రెండవస్థానం. ఇంకొకరు ఆ తర్వాత అరవై ఏడేండ్లకు కేంద్రంలో ప్రథమస్థానం వహించిన ప్రధానమంత్రి! ఒకరు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని దేశ ఉన్నతి కోసం పరితపించిన వ్యక్తి; ఇంకొకరు దేశంలో పెచ్చు పెరిగిన స్వార్థ రాజకీయాల్లో ఎదిగి దేశం ద్వారా తాను ఏమి లబ్ధి పొందవచ్చునన్న ఆలోచనలు చేసిన మనిషి. ముక్కలు చెక్కలుగా ఉన్న దేశాన్ని ఏకంజేసి జాతీయతను పెంపొందించాలని ధైర్యంతో, స్థయిర్యంతో, మేధా ప్రజ్ఞలతో, ఏక దీక్షతో ఆ ఆశయాన్ని సాధించిన ఉక్కు మనిషి. 'దేశంలో ఉన్నవారందరూ దేశానికే చెందుతారు. మనిషి ఎక్కడుంటే ఆ దేశానికే వారు త్రికరణ శుద్ధిగా పనిచేయాలని' ప్రకటించిన ధీరుడు. ఇంకొకరు 75 ఏండ్లుగా ఏకంగా ఉన్న మనుష్యులను విడదీసి, కొందరిని పరాయివాళ్లుగా ప్రకటించి వారి బతుకులు దుర్భరం చేయటానికి తనశక్తి, అధికారం ఉపయోగిస్తున్న పిరికి పంద! ఒకరిది దేశ ప్రగతి కోసం దీర్ఘదృష్టి; ఇంకొకరిది స్వార్థ రాజకీయాలతో హ్రస్వదృష్టి! ఒకరు విపక్షాలను ఎదుర్కొని పాలించగలిగిన సాహసవంతుడు, తెలివిమంతుడు; ఇంకొకరు విపక్షాలను తప్పుడు విధానాల ద్వారా, అన్యాయ మార్గాల ద్వారా, తన అధికార బలంతో అణచివేయాలని, నాశనం చేయాలనే దుష్టబుద్ధి, తెలివి తక్కువతనం ఉన్నవాడు. ఒకరు ప్రజాస్వామ్యంలో ప్రజలకు స్వాతంత్ర్యం ఇస్తూనే క్రమశిక్షణతో ఉంచాలన్న విచక్షణ ఉన్న నాయకుడు; ఇంకొకరు ప్రజాస్వామ్య విలువలను కాలరాసి, ఇష్టం లేనివారికి ఏ స్వాతంత్ర్యం, సంతోషం లేకుండా చేయాలని ప్రయత్నించే మూర్ఖుడు! ఒక్కరు న్యాయవాది, ఇంకొకరు అన్యాయవాది!



ఒకరు స్థితప్రజ్ఞుడు; ఇంకొకరు సంయమనం లోపించినవారు! ఒకసారి వల్లభాయ్ పటేల్ న్యాయస్థానంలో ఒక కేసు వాదిస్తుండగా ఒక టెలిగ్రామ్ వచ్చింది. ఆ రోజుల్లో టెలిగ్రామ్ చాలా ముఖ్యమైన విషయాలనే చేరవేసేది. అందుకని అసిస్టెంట్ దాన్ని అందుకని పటేల్‌కు అందించాడు. అది విప్పి చదువుకొని, మడిచి జేబులో పెట్టుకొని, తన వాదన సాగించాడు పటేల్. గంటకు తన వాదన ముగించుకొని, తను వెళ్లటానికి అనుమతి కోరాడు న్యాయాధీశుడిని. 'అదేమిటి, అవతలివారి తరఫు న్యాయవాది వాదనలు వినరా?' అని అడిగిన ఆయనకు విషయం చెప్పాడు. 'మిలార్డ్ నా భార్య చనిపోయిందని టెలిగ్రామ్ వచ్చింది. నేను వెడతాను' ఆశ్చర్యచకితుడైన ఆ జడ్జి సారీ చెప్పి వెంటనే వెళ్లటానికి అనుమతించాడు పటేల్‌ను! అదీ స్థితప్రజ్ఞత అంటే! రాగద్వేషాలు లేకుండా బాధ్యతాయుతంగా జీవించటమంటే! ఇంకొకరు కేవలం రాగద్వేషాల పల్లకీలోనే ఊరేగుతూ, రాజకీయ మర్యాదలు పాటించకుండా రాష్ట్రపతిని కేంద్ర సంసద్ భవన ప్రారంభోత్సవ సంబురానికి ఆహ్వానించరు. ఒక రాష్ట్రానికి వెళ్లి ఆ ముఖ్యమంత్రిని తనని కలవకూడదని ఆదేశిస్తారు, ఒకే ప్రమాణం పదేండ్ల పాటు ఆ పనిచేయకుండా వినిపిస్తారు. రాష్ట్రాల మధ్య న్యాయంగా చూపాల్సిన కనీస సమానత్వాన్ని,

ఒకసారి నెహ్రూ, సాక్షాత్తూ ప్రధానమంత్రి, ఆల్ ఇండియా రేడియోలో మాట్లాడుతూ, అనవసరమైనవీ, వివాదాస్పదమైన విషయాలు వివరిస్తుంటే ఆయన భాషణను ఆపించిన ఘనుడు ఒక గుజరాతీ: ఏ విపక్ష పాలిత రాష్ట్రానికి వచ్చినా అబద్ధాలు నిండిన వివాదాస్పద వ్యాఖ్యలు మాత్రమే భాషించే ఈ గుజరాతీ ఎక్కడ? ఈ ఇద్దరు గుజరాతీలకు ఏమైనా పోలిక ఉందా?

నిధుల విడుదలలో కనీస న్యాయాన్ని చూపరు. జరిగిన ప్రగతిని వక్రీకరించగలరు, లేక నిస్సిగ్గుగా తమ ఖాతాలో వేసుకోగలరు. నోరు విప్పితే అబద్ధాలు, అసత్యాలు; అన్యాయంగా ఇతర పక్షాల మీద నిందలు వేస్తారు. మరి ఇద్దరూ గుజరాతీలేనా? ఒకరు తను మానవుడిని అన్న భావంతో పరాయి పాలనలో మగ్గుతున్న సామాన్యుల కోసం స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న త్యాగధనుడైతే, ఇంకొకరు కేంద్ర ప్రభుత్వంలో అత్యున్నత స్థానంలో ఉండి ఇంకా తన రాష్ట్రంలో ఒక మూల పనిచేస్తున్న సర్పంచి లాగా ప్రవర్తించేవారు. అరిషడ్వర్గాలలోని కామ, క్రోధ, మోహ, మద, మాత్సర్యాలని అణువణువూ నింపుకొన్నవారు. మరి ఆ జాతీయ నాయకుడైన గుజరాతీ ఎక్కడ? వ్యక్తిత్వం కుంచించుకుపోయిన ఈ గుజరాతీ ఎక్కడ?

అవసాన దశలో ఆక్సిజన్ టెంట్‌లో ఉండి, తన విభాగం పనులు ఆగకూడదని ఫైల్స్ తెప్పించుకొని ఊపిరి ఆగేదాకా ప్రజల కోసం పనిచేసిన ఆ గుజరాతీ ఎక్కడ? అనుయాయులకు దేశ సంపద కట్టబెట్టాలని 20 మంది కోసం 140 కోట్ల ప్రజలను పట్టించుకోని ఈ గుజరాతీ ఎక్కడ?

మరి గుజరాతీ అన్నదే గుర్తింపైతే, దేశాన్ని దాటి విశ్వమానవుడిగా ప్రపంచ దేశాల వారు ఆరాధించే ఇంకో గుజరాతీని మర్చిపోయారేం? విదేశీ అతిథులకు ఆయన సమాధి చూపించటమేనా లేక ఆయన ప్రవచించిన సమానత్వం, మానవీయత ఎప్పటికైనా అర్థం చేసుకుంటారా? అనుమానమే!

## ఆ గట్టున 58 ఏండ్లు..ఈ గట్టున 9 ఏండ్లు

తెలంగాణ వస్తే కరెంటు ఉండదని ఒకరు, నీళ్లు రావని మరొకరు, వ్యవసాయం చేత కాదని ఇంకొకరు, పరిపాలనే చేత కాదని, హైదరాబాద్ నాశనమైపోతుందని మరికొందరు శాపనార్థాలు పెట్టారు. కానీ వాటన్నింటినీ పటాపంచలు చేస్తూ ఉద్యమకారుడు, పరిపాలనాదక్షుడు, దార్శనికుడు అయిన కేసీఆర్ సమైక్య పాలనలో 58 ఏండ్లలో సాధ్యం కాని అభివృద్ధిని కేవలం తొమ్మిదేండ్ల పాలనలో సాధించి చూపించారు. అన్ని రంగాల్లో సంస్కరణలు ప్రవేశపెట్టి దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా చేశారు. రాష్ట్రాభివృద్ధి పట్ల ఆయనకు ఉన్న దూరదృష్టి, తపనే ఇందుకు కారణం.




సాసాల మల్లికార్జున్
83282 10190

కేవలం పేరు కోసమే ఒక రాష్ట్రం ఏర్పడితే సుదీర్ఘ కాలం జరిగిన ఉద్యమానికి, మనుష్యుల ప్రాణ త్యాగాలకు విలువ ఉండదని, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అవసరమనేది ప్రజలు తాము అభివృద్ధి చెందడానికి, మరింత అభివృద్ధికి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి సహాయపడేటట్టు ఉండాలనే ఆలోచనతో కేసీఆర్ తెలంగాణ రాష్ర్టాన్ని ప్రగతి పథం వైపు తీసుకెళ్తున్నారు. అన్ని రంగాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఒక విజన్‌తో రాష్ర్టాన్ని దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దారు. వివిధ రంగాల్లో గత, ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం సాధించిన ప్రగతేమిటో అర్థమవుతుంది.

వ్యవసాయరంగాన్ని పరిశీలిస్తే కొత్త ప్రాజెక్టుల నిర్మాణం, పాత నీటి పారుదల ప్రాజెక్టుల మరమ్మతుల వల్ల రాష్ట్రం ఏర్పడినప్పుడు 62.48 లక్షల ఎకరాలుగా ఉన్న ఆయకట్టు 2021-22 నాటికి 1.35 కోట్ల ఎకరాలకు చేరి 117 శాతం వృద్ధిని సాధించింది. నాడు వరి ఉత్పత్తి 45.71 లక్షల మెట్రిక్ టన్నులు ఉండగా, 2021-22 నాటికి 202 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. 2013-14లో ఒక కోటి ఎకరాల్లో పంటలు సాగైతే, 2022-23 నాటికి సాగు విస్తీర్ణం 2.20 కోట్ల ఎకరాలకు పెరిగింది. వరి ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల సాధించాం. పత్తి ఉత్పత్తిలో 32 శాతం వృద్ధి, పండ్ల ఉత్పత్తిలో రెండో స్థానం, ఆయిల్ పామ్ సాగులో ఆరో స్థానం సాధించగలిగాం. నాడు మన దగ్గర ఉన్న గోదాముల సామర్థ్యం 4 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, నేడు 25 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగింది.

విద్యారంగాన్ని గమనిస్తే ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో కేవలం 293 గురుకులాలు ఉండేవి. కానీ బీఆర్ఎస్ పాలనలో తొమ్మిదేండ్లలోనే కొత్తగా 709 గురుకులాలను స్థాపించారు. ఈ గురుకులాల్లో కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా నాణ్యమైన వసతులతో కూడిన విద్యను అందిస్తున్నారు. నేడు గురుకుల కళాశాలల విద్యార్థులు బహుళజాతి సంస్థల క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికై ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రతిభావంతులైన నిరుపేద ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు బీఆర్ అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు మహాత్మా జ్యోతిబా పూలే పథకం ద్వారా, బ్రాహ్మణ విద్యార్థులకు స్వామి వివేకానంద పథకం ద్వారా, మైనారిటీ విద్యార్థులకు కేసీఆర్ ఓవర్సీస్ పథకం ద్వారా విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించడానికి రూ.20 లక్షల ఉపకార వేతనాన్ని కేసీఆర్ సర్కార్ అందిస్తున్నది. ఒక బడి నిర్మిస్తే వేయి మంది మేధావులు తయారవుతారనే అంబేద్కర్ మాటలను ఆదర్శంగా తీసుకొని సర్కారు బడుల్లో మౌలిక వసతుల కల్పనకు మన ఊరు-మన బడి పథకాన్ని తీసుకొచ్చి వాటి రూపురేఖలను మార్చుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మాధ్యమం ప్రవేశపెట్టి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నది రాష్ట్ర ప్రభుత్వం.



వైద్యరంగాన్ని గమనిస్తే ఒకనాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కొరత తెలంగాణను వేధించేది. నేడు తగినన్ని ప్రభుత్వ దవాఖానలు, జిల్లాకో వైద్య విద్య, పారా మెడికల్, నర్సింగ్ కాలేజీలను స్థాపించుకునే దశకు చేరుకున్నాం. మాతృత్వ మరణాల రేటు (బాలింతల మరణాలు) ఉమ్మడి రాష్ట్రంతో పోలిస్తే భారీగా తగ్గాయి. శిశు మరణాల రేటు ఉమ్మడి రాష్ట్రంలో 35 శాతం ఉండగా, నేడు 21 శాతానికి తగ్గాయి (ఇది జాతీయ సగటు 28 శాతం కన్నా తక్కువ). రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ వల్లే ఇది సాధ్యమైంది.

జిల్లాకో వైద్య కళాశాల లక్ష్యంగా తెలంగాణ సర్కారు చేపట్టిన చర్యలతో 2014 నాటికి ప్రభుత్వ విభాగంలో కేవలం 850 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉండగా ఇప్పుడా సంఖ్య 4,590కి పెరిగింది. కేంద్ర ఆర్థిక సర్వే 2022-2023 ప్రకారం దక్షిణ భారతదేశంలో ప్రజా వైద్యంపై చేస్తున్న ఖర్చులో ప్రభుత్వ వాటా ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం 2వ స్థానంలో నిలిచింది. వైద్యం కోసం చేసే ఖర్చులో ప్రజలపై తక్కువ భారం పడుతున్న రాష్ట్రాల్లో 3వ స్థానంలో నిలిచింది. తెలంగాణ డయాలసిస్ పథకం, వ్యాధి నిర్ధారణ పథకం, కంటి వెలుగు, మహిళా ఆరోగ్య పథకం లాంటి ఎన్నో పథకాలతో ప్రజారోగ్యంపై ఎంతో శ్రద్ధను చూపిస్తున్నది తెలంగాణ ప్రభుత్వం.

ఉమ్మడి రాష్ట్రంలో గృహాలకు 4-8 గంటలపాటు విద్యుత్తు కోతలు విధించేవారు. పరిశ్రమలకు వారంలో రెండు రోజులు పవర్ హాలిడే ఇచ్చేవారు. 4 నుంచి 6 గంటల పాటు అస్తవ్యస్తమైన విద్యుత్తు సరఫరా వల్ల వ్యవసాయంలో నష్టం కలిగి రైతులు ఆత్మహత్య చేసుకొనేవారు. కానీ రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం 7,778 మెగావాట్లు కాగా ప్రస్తుత సామర్థ్యం 18,567 మెగావాట్లు. రాష్ట్రం ఏర్పడినపుడు సోలార్ విద్యుత్తు ఉత్పత్తి 72 మెగావాట్లు కాగా నేడది 5,741 మెగావాట్లకు చేరుకున్నది. గృహ, వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలకు రోజులో 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తున్నది తెలంగాణ ప్రభుత్వం. సుమారు 27 లక్షల రైతులకు రోజులో 24 గంటలపాటు ఉచిత విద్యుత్తును అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. తక్కువ ట్రాన్స్‌మిషన్ నష్టంలో 2వ స్థానంలో ఉన్నాం. తలసరి విద్యుత్తు వినియోగం 2014లో 1,152 కిలోవాట్లుగా ఉండగా ప్రస్తుతం అది 2,126 కిలోవాట్లకు చేరుకొంది.

మానవీయ దృక్పథం లేని ప్రగతి నిరర్థకమని నమ్మిన సీఎం కేసీఆర్ ఆసరా పింఛన్ల మొత్తాన్ని రూ.200 నుంచి రూ.2016కు పెంచారు. దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ మొత్తాన్ని రూ.4016కు పెంచారు. కొత్తగా బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, డయాలసిస్ రోగులు, ఫైలేరియా బాధితులకు ఆసరా పింఛన్లు అందిస్తున్నది బీఆర్ఎస్ ప్రభుత్వం. పేదింటి ఆడపిల్లల పెండ్లి తల్లిదండ్రులకు భారంగా మారకూడదని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేస్తున్నది. ఇప్పటివరకు 13.16 లక్షల మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. దళిత బంధు, బీసీ బంధు, చేనేత బీమా, పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు, గృహలక్ష్మి పథకం.. ఇలా చెప్పుకొంటూ పోతే సమాజంలోని అన్నివర్గాల అభివృద్ధి పట్ల కేసీఆర్‌కు ఉన్న విజన్ తెలుస్తది.

ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ కృషి కారణంగా ఐటీ రంగంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. ఐటీ వార్షిక ఎగుమతుల విలువ 2014లో రూ.57,258 కోట్లు ఉండగా.. 2023 నాటికి రూ.1,83,569 కోట్లకు పెరిగింది. ఐటీ ఉద్యోగ నియామకాల్లో 156 శాతం వృద్ధి నమోదైంది. ఐటీ రంగాన్ని ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరింపజేయడం అభివృద్ధి పట్ల తెలంగాణ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం. అడవుల పునరుద్ధరణ, పర్యావరణ సమతుల్యత కోసం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన హరిత హారం వల్ల రాష్ట్రం ఏర్పడప్పుడు 19,854 చదరపు కిలోమీటర్లుగా ఉన్న అటవీ విస్తీర్ణం 2023 నాటికి 26,969 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. పచ్చదనం 7.70 శాతం పెరిగింది.

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణలో పేదరికం తగ్గింది. 2015-16లో తెలంగాణలో 13.18 శాతం జనాభా పేదరికంలో ఉండగా 2019-20 నాటికి అది 5.88 శాతానికి తగ్గిందని నీతి ఆయోగ్ తెలిపింది. రాష్ట్రంలో సగటు పౌరుడి ఆదాయం సుమారు 5-6 ఏండ్లలో రెట్టింపవుతుండగా, దేశ స్థాయిలో అందుకు 8-9 ఏండ్లు పడుతున్నది.

ఎంతో ఘన చరిత్ర కలిగిన పార్టీ మాదని, విజన్ ఉన్న నాయకులున్న పార్టీ మాదని ఢంకా బజాయించుకున్న గత పాలకులు ఇన్నేండ్లలో ప్రవేశపెట్టని అభివృద్ధి పథకాలను కేవలం తొమ్మిదేండ్లలో ప్రవేశపెట్టడం సీఎం కేసీఆర్ విజన్‌కు నిదర్శనం. దేశంలో కొత్త రాష్ట్రంగా ఏర్పడ్డ తెలంగాణ కేసీఆర్ సారథ్యంలో అనతికాలంలోనే తెలంగాణ నమూనాతో అభివృద్ధి పథంలో నడుస్తూ దేశం యావత్తు తన వైపు చూసేలా చేసుకున్నది. తెలంగాణ అభివృద్ధే లక్ష్యంగా దూరదృష్టి, గొప్ప విజన్ కలిగిన ఉద్యమ నాయకుడు ముఖ్యమంత్రి కావటం, రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదేండ్లలోనే ఇన్ని విజయాలు సాధించడం తెలంగాణ ప్రజల కష్టాలకు, త్యాగాలకు దక్కిన ప్రతిఫలం.

**(వ్యాసకర్త: చరిత్ర సహాయ ఆచార్యులు)**